

సాహిత్య శిఖరం ఆమె.. విద్యాకుసుమం ఆమె..
అభ్యుదయ భావజాలమే ఆమె ఆభరణం..
తెలుగు భాషావృద్ధికి ఆమె కృషి అమోఘం..
సాగరతీరం కాకినాడలో ఎన్నో తరాలను
తీర్చిదిద్దిన సుజ్ఞాని ఆమె..
బతుకునిచ్చే పాఠాలు, జీవన వికాసానికి
పాటవాలు నేర్పిన ఉపాధ్యాయినిగా..
విద్య, సాహిత్య, సేవా రంగాలను
సమాజహితంగా ఏలిన మహారాణిగా..
సామాజిక దృక్పథమై అనేక వేదికలపై వినిపించిన సబలవాణి..
కాకినాడ ఐడియల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవినీ కుమారి..
ఆమె పరమపద సోపానం.. కాకినాడను దుఃఖసాగరంలో ముంచింది.
వయోభారంతో ఆమె వెడలినా.. ఆమె జీవన ప్రస్థానం..
వేనవేల మంది మదిలో.. కాకినాడ హృదిలో ఆమె 'చిరంజీవిని'..
అందుకే ఆమెను 'మదర్' ఆఫ్ కాకినాడ అనడంలో ఏ మాత్రం సందేహం లేదు..



చిరంజీవినీ కుమారి(ఫైల్)



కాకినాడ మదిలో చిరంజీవినే..

అస్తమించిన అభ్యుదయవాది చిరంజీవినీ కుమారి

94 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి



చిరంజీవినీ కుమారి భౌతికకాయం వద్ద నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అభ్యుదయవాది, సాహితీవేత్త, విద్యా రంగానికి మార్గదర్శకురాలు, సామాజికవేత్త, కాకినాడలోని ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి(94) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో ఇంటివద్ద తుదిశ్వాస విడిచారు. 1931, మార్చి 30న ఆమె జన్మించారు. చిరంజీవినీకుమారి భర్త పేరు పాలెపు శర్మ. స్వాతంత్ర్య సమరయోధుడు..ఆయన కొన్నేళ్ల కిందట మరణించారు. వీళ్లకి ఇద్దరు కుమారులు.పెద్ద కుమారుడు పీబీఎస్ గోపాల్ వృత్తి రిత్యా వైద్యుడు విదేశాల్లో ఉంటున్నారు. చిన్నకుమారుడు పీఎస్ఎస్ కిరణ్.. కాకి నాడలోనే ఉంటూ కుటుంబ వ్యాపారాలు చూసుకుంటున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా చిరంజీవినీ కుమారి గుర్తింపు పొందారు. మానవ మనుగడకు మూలాలే ప్రధా నం. వాటిని అసలు మరిచిపోకూడదనే ఆమె.. ఆస్తులను పంచి ఇచ్చినట్టుగానే వాటిని పిల్లలకు పంచి ఇవ్వాలని చెబుతూ ఉండేవారు. ఆమె మానవ విలువలపైనే వేదికలపై ప్రసంగించేవారు. మానవసంబంధాలు మృగ్యమైపోతున్నాయని వాటిని కాపాడాలని పదే పదే చెప్పేవారు. తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా జిల్లాలో భాషా సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఐడియల్ కళాశాలలో తెలుగు భాషను మాత్రమే ద్వితీయ భాషగా కొనసాగిస్తూ తెలుగు భాషా సంస్కృతి వికాసానికి ఎనలేని సేవలందించారు.మహాకవి శ్రీశ్రీ షష్టిపూర్తి, వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వేడుకలు, డాక్టర్ గరికిపాటి నరసింహారావు మొదటి సహస్రావధానం మొదలైన కార్యక్రమాలు ఐడియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలోనే నిర్వహించారు. కాకినాడ రూరల్ మండలంలోని కొవ్వాడ గ్రామాన్ని దత్తత తీసుకుని అక్కడ యువతకు ఉపాధికి కృషి చేశారు. మహిళలు, పిల్లలు, తదితర యువతీయువకుల్లోని ప్రతిభాపాటవాలను వెలికితీయిస్తున్నారు.

1970లో కళాశాల పెట్టి..

కాకినాడ జిల్లా కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా కొంత కాలం పనిచేసిన చిరంజీవినీకుమారి డాక్టర్ పీవీఎన్ రాజుతో కలిసి 1970లో ఐడి యల్ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు ఈ కళాశాలలో చదివిన వారే. నేడు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆమె కాకినాడ అన్నవరం సత్యవతీదేవి మహిళా కళాశాల ఫౌండర్ మెంబర్‌గా, ఐడియల్ జూనియర్, డిగ్రీ కళాశాల, ఐడియల్ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌కు ఫౌండర్ సెక్రటరీగా, ఐడియల్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌కు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఫౌండర్ మెంబర్ ఆఫ్ ఏయూ పీజీ సెంటర్ కాకినాడ, ఏపీ స్టేట్ ప్రైవేట్ కాలేజీస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, వేణుగోపాల సంస్కృత ప్రచార సభ కాకినాడ సెక్రటరీగా, తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంఘం సెక్రటరీగా, గిరిజన ప్రాంతంలోని 'స్పందన' స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్‌గా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా, ఆంధ్ర ప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సభ్యురాలిగా, జనవిజ్ఞాన వేదిక స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య సభ్యురాలిగా, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సాధన సమితి వైస్ ప్రెసిడెంట్‌గా, జిల్లా అక్షరాస్యత సమితి 'అక్షర గోదావరి' సభ్యురాలిగా, జిల్లా విద్యాకమిటీ, జిల్లా టీబీ నియంత్రణ కమిటీ, జిల్లా అధికార భాషా సంఘం సభ్యురాలిగా ఎలా ఎన్నో పదవులను ఆమె చేపట్టారు. 2005లో న్యూఢిల్లీ వారు మదర్ ఇండియా జాతీయ అవార్డు అందజేశారు.హైదరాబాద్‌లో తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారం, 2011లో శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారం, 2012లో షీ ఫౌండేషన్ హైదరాబాద్ వారు ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్,ఉమెన్ పురస్కారం అందజేశారు. 2014లో ఐ.పోలవరంలోని పుల్లెల తాతయ్య మెమోరియల్ అసోసియేషన్ వారు ఇంటిగ్రల్ హ్యూమనిస్ట్ అవార్డు అందజేశారు.

ఎన్నో రచనలు..

రచయితగా అనేక పుస్తకాలు రచించారు. 3-బుక్స్ ఆఫ్ తెలుగు పొయిట్రీ, బుక్ ఆఫ్ పోయమ్స్ ఆఫ్ 32 ఉమెన్ రైటర్స్ ఆఫ్ సోవియట్ ల్యాండ్ 'లేత మందారాలు.. రక్త సిందూరాలు',ఏ బుక్ ఆఫ్ స్టోరీస్ ట్రాన్స్‌లేటెడ్ ఫ్రమ్ఆర్మీనియన్ రైటర్స్ ఎస్సై షల్లీ తుమాన్యాన్..'ఆర్మీనియా కథలు- గాథలు '..'తూర్పు గోదావరి జిల్లా చరిత్ర- సం స్కృతి', గోదావరి కథలు-అలలు(తూర్పుగోదావరి జిల్లా కథల సంకలనం),ఎ రైటర్ ఆఫ్ అబౌట్ 80 ఎస్సేస్ ఇన్ ఏరియా ఆఫ్ లిటరేచర్, సోషల్ అండ్ ఉమెన్ ఏస్పెక్ట్స్, అబౌట్ 20 రేడియో టాక్స్ (మంచి వక్త, విమర్శకురాలు) ఉన్నాయి.

నేడు అంత్యక్రియలు

కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని ఆమె నివాసం నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు చిరంజీవినీ కుమారి భౌతికకాయాన్ని ఊరేగింపుగా ఇంద్రపాలెం లాకుల వద్ద గల ఐడియల్ కళాశాలకు తీసుకెళ్లనున్నారు. విద్యార్థులు, ప్రముఖుల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని అక్కడ ఉంచనున్నారు. అక్కడి నుంచి 3 గంటలకు శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కళాశాల గవర్నింగ్ బాడీ తెలిపింది.

నేటి నుంచి ఇంటర్ కళాశాలలు పునఃప్రారంభం

అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్ర జ్యోతి): ఇంటర్మీడియట్ కళాశాలలు సోమవారం నుంచి తిరిగి ప్రారంభిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈ ఏడాది జూనియర్ కళాశాలలు ఏప్రిల్ 1 నుంచే ప్రారంభించే లా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అదే నె ల 7 నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్లు ప్రారంభించారు. జూన్1వ తేదీతో వేసవి సెలవులు ముగిసినందున 2 నుంచి కళాశాలలు తిరిగి ప్రారంభిస్తున్నామన్నారు.

నేడు యథావిధిగా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ఉదయం 10గంటలనుంచిప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునన్నారు. ఏవైనా సందేశాలు ఉంటే అడగడంతోపాటు కొత్త ఫిర్యాదులు నమోదు చేయవచ్చునని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రెవెన్యూ డివిజన్లు, 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్నామన్నారు.

ఐపీఎల్ షో అదిరే!

కాకినాడలో క్రికెట్ సందడే..



కార్పొరేషన్(కాకినాడ), జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం క్రికెట్ అభిమానులతో సందడి నెలకొంది. క్రికెట్ ప్రేక్షకుల కోసం బీసీసీఐ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ లైవ్ మ్యాచ్ వీక్షణకు పది వేల మంది క్రికెట్ అభిమానులు విచ్చేసినట్టు అంచనా. వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యం కావడంతో కొంతమంది నిరాశతో వెనుదిరిగారు. వర్షం తగ్గిన తర్వాత 9.45 గంటలకు పంజాబ్, ముంబాయి జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కావడంతో అధిక సంఖ్యలో క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆనందంగా వీక్షించారు.రాజ్యసభ ఎంపీ, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్‌బాబు పట్టుదలతో ఐపీఎల్ ఫైనల్ లైవ్ స్క్రీనింగ్ చూసే ఏకైక ఫ్యాన్ పార్క్ కాకినాడలో ఏర్పాటు చేశారు.లైవ్ మ్యాచ్ స్క్రీనింగ్,ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, డీజే సంగీతం, ఫుడ్‌కోర్ట్స్,కుటుంబ వినోదం ఉన్నాయి.కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పంతం నానాజీ,ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ,కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జేసీ రాహుల్ మీనా తదితరులు వచ్చారు.

ఎక్కడైనా రేషన్!

రేషన్ పంపిణీ ప్రారంభంలో మంత్రి నాదెండ్ల మనోహర్

- వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్
- ఉదయం 8 నుంచి పంపిణీ
- డీలర్ల అవకతవకలు సహించం
- ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు
- డిపో వద్ద నెంబర్ల ఏర్పాటు
- బియ్యం స్మగ్లింగ్ చేస్తే పీడీ యాక్ట్
- 21 రోజుల్లో కొత్త కార్డులు





సర్పవరంలో వృద్ధుడి ఇంటికెళ్లి రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్.. పిఠాపురంలో కార్డుదారులతో మాటామంతీ

పిఠాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్డుదారులు తమకు నచ్చిన లేదా దగ్గరగా ఉన్న చౌక ధరల దుకాణం ద్వారా సరుకులు తీసుకునే అవకాశాన్ని కల్పించామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. పిఠాపురం నూకాలమ్మ గుడి వీధి 18వ వార్డులో చౌక ధరల దుకాణం ద్వారా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సరుకుల పంపిణీని ప్రారంభించారు.ఈ పోస్ యంత్రంపై కార్డుదారులు వేలిముద్ర వేసిన తర్వాత వారికి సరుకులను అందజేసి మాట్లాడారు. ప్రతి దుకాణానికి నిర్దేశించిన కోటా కంటే అదనంగా పదిశాతం సరుకులు పంపామని చెప్పారు. చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీలో ఎక్కడ తప్పు జరిగినా తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. కార్డుదారులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా అన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి చౌక ధరల దుకాణం వద్ద డీలరు పేరు, షాపు నెం బరు ఇతర వివరాలు ప్రదర్శించడంతో పాటు వాటిపైనే డీఎస్‌వో, తహశీల్దార్, ఇతర అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ ఫోన్ల ద్వారా లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సరుకుల పంపిణీలో ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఉండే తెలపవచ్చునని చెప్పారు. తూకం, సరుకుల నాణ్యత తదితర అంశాల్లో లోపాలు ఉన్నా, సమయానికి తెరవకున్నా ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వీటిని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ నేతృత్వంలోని కేంద్ర కార్యాలయం నిరంతరం సమీక్షిస్తూ ఉం టుందని తెలిపారు. రేషన్ డిపోల ద్వారానే కార్డుదారులకు నిజాయితీగా సరుకులు అందు తాయని చెప్పారు. కాకినాడ పోర్టు ద్వారా జరిగే బియ్యం స్మగ్లింగ్ అరికట్టామని, అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. బియ్యం స్మగ్లింగ్‌పై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. రేషన్ షాపులు ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 8నుంచి 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ తెరిచి ఉంటాయని తెలిపారు. కాకినాడ జిల్లాలో 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు 71 వేల మంది ఉన్నారని గుర్తించామని, వీరికి ప్రతి నెలా 5వతేదీ లోగా సరుకులు అందించి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. పింఛన్ల పంపిణీ మాదిరిగా గంటగంటకు, ప్రతి రోజూ సరుకుల పంపిణీ వివరాలు తెలిపేందుకు ప్రత్యేక యాప్ రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. కొత్తకార్డులు, సభ్యులు చేర్పు, తొలగింపు, చిరునామాల మార్పు తదితరాల కోసం చేసిన దరఖాస్తులను 21 రోజుల్లో పరిష్కరించి కొత్తకార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పం తం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్,కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనా,పాడా పీడీ చైత్రవర్షిణి, 18వ వార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు

అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యానిధి స్కూలులో ఈనెల 3న జిల్లాస్థాయిలో సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల ద్వారా ఈనెల 7,8 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నలుగురు సీనియర్ క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. జిల్లాస్థాయి పోటీల్లో వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా కోనసీమ జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చునన్నారు. ప్రవేశరుసుము రూ.300 చెల్లించాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 2వ తేదీ సాయంత్రం 6 గంటలలోపు సెల్ 9849175179ను సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్స్ రాత పరీక్ష

7



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

అన్నవరం దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగుల తాత్కాలిక తొలగింపు

7

ప్రజాపంపిణీ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్
- జిల్లావ్యాప్తంగా రేషన్ డిపోలు పునఃప్రారంభం



అమలాపురంలోని ఓ దుకాణంలో వృద్ధుడికి రేషన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే ఆనందరావు, జేసీ నిషాంతి

అమలాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి):ప్రజా పంపిణీ వ్యవస్థకు మంచిపేరు తీసుకువచ్చేందుకు డీలర్లు ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. అమలాపురం 2వ వార్డులోని నల్లావీధిలో 18వ చౌక ధరల దుకాణాన్ని పండుగ వాతావరణంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి కలెక్టర్ ఆదివారం పునఃప్రారంభించారు. ఈపీవో మిషన్ల ద్వారా రశీదులు అందించి సీనియర్ సిటిజన్లకు రేషన్ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరైన తూనికలు, కొలతలతో నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలని, పౌర సరఫరాలశాఖ నిర్దేశించిన ధరలు, స్టాక్ బోర్డులను షాపుల ముందు ప్రదర్శించి ఆ ప్రకారం విక్రయాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పాత విధానాన్ని పునరుద్ధరించి తిరిగి అమలులోకి తీసుకువచ్చిందన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ రేషన్‌కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా సరుకులు పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. జేసీ టి.నిషాంతి మాట్లాడుతూ జిల్లాలో 926 చౌక ధరల దుకాణానికి సంబంధించి 5.37లక్షలమంది రేషన్‌కార్డుదారులు ఉన్నారన్నారు. కార్డుదారులు తమకు అనుకూలమైన సమయంలో డిపోలకు వెళ్లి సరుకులు పొందవచ్చునన్నారు. సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కె.మాధవి, జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, కౌన్సిలర్లు పడాల శ్రీదేవి, ఆశెట్టి నాగదుర్గ, యేడిద శ్రీను, మాకిరెడ్డి వీఎస్ఎస్ పూర్ణిమ పాల్గొన్నారు.

సెంట్రల్ డెల్టా కాలువలకు సాగునీరు విడుదల



ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద గోదారమ్మకు పూజలు చేస్తున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల, ఎస్ఈ శ్రీనివాస్

ఆత్రేయపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టా ప్రధాన కాలువలకు ఆదివారం సాగునీరు విడుదల చేశారు. సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ గోదారమ్మకు హారతులు ఇచ్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్విచ్ ఆన్ చేసి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్, ఎస్ఈ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సెంట్రల్ డెల్టాకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. తొలిరోజు 100 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేశారు. కాలువలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన వెంటనే ఖరీఫ్ సాగుకు త్వరతగతిన ఆకుమడులు వేసుకుని వరినాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని లొల్ల ప్రధాన లాకుల ద్వారా ముక్తేశ్వరం బ్యాంకు కెనాల్ వద్ద లొల్ల-మెర్లపాలెం సమీపంలో సైఫాన్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన వెంటనే బ్యాంకు కెనాల్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తామన్నారు. జూన్ 10లోగా ఈ ప నులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ కరుటూరి నరసింహారావు, డీఈ నాగేంద్రకుమార్, ఆత్రేయపురం ఏఈ మాధవ్, అమలాపురం డీసీలు రాజులపూడి వెంకటేశ్వరరావు, కాకర శ్రీని వాస్, సరిపెల్ల శ్రీనివాసరాజు, పేరవరం నీటి సంఘం అధ్యక్షుడు జుజ్జవరపు హరిబాబు పాల్గొన్నారు.

ఎన్జీవో సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు

విద్యాసాగర్‌కు ఘన సత్కారం


విద్యాసాగర్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఎన్జీవో సంఘ నేతలు

కాకినాడ సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన ఆలపాటి విద్యా సాగర్‌ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్జీవో సంఘ నేతలు ఆదివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. విజయ వాడలో జరిగిన ప్రమాణ స్వీకారోత్స వానికి జిల్లా నుంచి పలు వురు నేతలు తరలి వెళ్లారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని పలు వురు అన్నారు. కార్యక్రమంలో ఎన్జీవోల సంఘ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, ఏపీటీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.6.83 లక్షల ఆదాయం




తునిరూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పు ణ్యక్షేత్రం లోవ దేవస్థానం భక్తులతో ఆదివారం కిటకి టలాడింది. వేకువజాము నే తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తర లి వచ్చారు. ప్రత్యేక క్యూ లైన్‌లో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లిం చుకున్నారు. దీనిలో భాగంగా వివిధ విభాగాల ద్వారా రూ. 6.83 లక్షల ఆదాయం సమ కూరినట్టు ఈవో విశ్వనా థ్‌రాజు తెలిపారు.

క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, తలుపులమ్మ వారు

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అమలాపురం మండలం రోళ్లపాలెం గ్రామానికి చెందిన ఉండ్రాజవరపు నందిని (21) గత నెల 30న చర్చికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. భార్య ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడేళ్ల క్రితం నందిని, జగదీష్ ప్రేమ వివాహం చేసుకున్నారు.

కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ పి. వీరబాబు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

● గోదావరి నదిలో మునిగి ఒకరు... రోడ్డుప్రమాదంలో మరొకరు... క్వారీలో జారిపడి ఇంకొకరు.. రైలు ఢీకొని యువకుడు..


గోదావరి నది నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులుఆదివారం సాయంత్రం గుర్తించారు. స్థానిక లాంచీలరేవు సమీపంలో మృతదేహం తేలి ఉందని సమాచారం రావడంతో పట్టణ సీఐ వి. విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా గుంటూరు జిల్లా మంగళగిరి బాలాజీనగర్‌కు చెందిన మందిశెట్టి శ్రీనివాసరావు (55)గా గుర్తించారు. ఈమేరకు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్టు పోలీసులు తెలిపారు.

నల్లమెటల్ క్వారీలో...

రౌతులపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మూలగపూడి సర్వేనెంబర్- 1లో గల నల్లమెటల్ క్వారీలో పడి ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లాకు చెందిన వడ్డే ఉమామహేష్ (37) విష్ణు మెటల్ గ్రానైట్ అండ్ సప్లయర్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం క్వారీలో డ్రిల్లింగ్ చేస్తుండగా జారిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో హుటాహుటిన కాకినాడ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనంతపల్లి హైవేలో...

నల్లజర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలోని అనంతపల్లి హైవేలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశరావు పాలెంకి చెందిన చికిలే వెంకటేష్ (34) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయన యర్నగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొంది. దీంతో కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రైలు ఢీ కొని ..

తుని రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వేపోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రావికంపాడు - పిఠాపురం రైల్వేస్టేషన్ల మధ్య విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు సుమారు 35 సంవత్సరాలు వయస్సుగల వ్యక్తిని ఢీ కొట్టగా ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ జి. శ్రీనివాస్ తెలిపారు. మృతుడు పింక్ కలర్ టీషర్ట్, నీలం రంగు జీను ప్యాంట్ ధరించినట్టు ఆయన వెల్లడించారు. ఈయన సంబంధీకులు ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.


రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి ఆదివారం స్వామి వారి ఆర్జిత సేవ రథోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లను రథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజల అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

విద్యార్థుల అపూర్వ కలయిక


వేళంగి హైస్కూల్‌లో కలుసుకున్న 1999-2000 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

కరప, జూన్1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. 1999- 2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన తెలుగు తల్లి విగ్రహాన్ని అప్పటి ప్రధానోపాధ్యాయులు నేమాని వెంకటరామారావు, పట్టాభిరామారావు ఆవిష్కరించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను బాణసంచా కాల్పుల నడుమ పూలబాటలో వేదిక వరకు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం వారితో కలిసి గ్రూపు ఫొటోలు తీయించుకుని సందడి చేశారు. దీనిలో భాగంగా పలువరు మాట్లాడారు. అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ ఆధ్వర్యంలో కేవీవీఎస్ఎస్ గుణేశ్వరరావు(గుణ) అధ్యక్షతన జరిగిన ఆత్మీయ స్నేహ సమ్మేళనంలో మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నరావు, హెచ్‌ఎం కె.భారతి, పూర్వ విద్యార్థులు గరగ అనిత, హేమారావు, వనుం ఉపేంద్రనాథ్, కడలి లోవరాజు, బి.సతీష్, సీతాలక్ష్మి, తాతాజీ, అడపా వెంకటేశ్వరరావు, చుద్రు మంగాదేవి, సత్యవతి, వీరలక్ష్మి, శేషవతి, కార్తీక, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారీ తాచుపాము

హల్‌చల్

● భయాందోళన చెందిన వాకలగరువు గ్రామస్థులు


వాకలగరువులో పామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మ

అంబాజీపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం వాకలగరువులో భారీ తాచుపాము ఆదివారం హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన జొన్నాడ ఈశ్వరరావు ఇంటి వద్ద ఐదు అడుగుల గోధుమ నాగు కనిపించడంతో స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. ఆయన వచ్చి పామును బంధించి జన సంచారం లేని ప్రదేశంలో వదిలాడు.

బైకును దౌర్జన్యంగా తీసుకెళ్లిన వ్యక్తులపై కేసు

అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మోటారుబైకును దౌర్జన్యంగా తీసుకువెళ్లిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈదరపల్లి ఆర్‌ఆర్‌నగర్‌లో మోటారు బైకు మెకానిక్‌గా షేక్ మజీద్‌బాషా పనిచేస్తున్నాడు. పి.గన్నవరం మండలం కె.ముంజవరం గ్రామానికి చెందిన అడబాల నారాయణ ఐదు నెలల క్రితం రాయల్‌ఎన్‌ఫీల్డ్ మోటారు బైకును మరమ్మతుల నిమిత్తం ఇచ్చాడు. ఎంతకు మోటారుసైకిల్‌ను బాగుచేసి ఇవ్వకపోవడంతో మెకానిక్ వద్దనున్న వేరొకరికి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారుసైకిల్‌ను స్నేహితులతో కలిసివచ్చి దౌర్జన్యంగా తీసుకువెళ్లాడు. నజీన్‌బాషా ఫిర్యాదు మేరకు నారాయణతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు.

మినీ మాల్స్‌గా రేషన్ దుకాణాలు!

వలసపాకలలో వృద్ధుడి ఇంటికెళ్లి రేషన్ అందించిన మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నానాజీ



వలసపాకలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

సర్పవరం జంక్షన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 'పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక స్వలాభం కోసం ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చి బలమైన ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో రేషన్ కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఎండీయూ స్థానే రేషన్ షాపులను పునఃప్రారంభించారు.. భవిష్యత్‌లో వాటిని మినీ మాల్స్‌గా చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది' అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకలలో సూరంపూడి కిషోర్‌కు చెందిన 56వ నెంబరు రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పౌరసరఫరాల శాఖ కమిషనరు సౌరవ్‌గౌర్, జేసీ రాహుల్ మీనాలతో కలిసి నాదెండ్ల ప్రారంభించారు. వాసంశెట్టి గోపాల్ అనే వృద్ధుడి ఇంటికెళ్లి 20 కిలోల బియ్యం, పంచదార, నిత్యావసరాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే నానాజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, రాగులు, మిల్లెట్లు, సజ్జలు, జొన్నలు, కొర్రలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, తహసీల్దారు కుమారి, ఎంపీడీవో పి.సతీష్, మాజీ మంత్రి రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), నులుకుర్తి వెంకటేశ్వరరావు, జీని శ్రీనివాస్, కరెడ్ల గోవిందు, జిల్లా రేషన్ డీలర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు నదిలో చిక్కుకున్న యువకులు

- రక్షించిన పోలీసులు, మోతుగూడెం ఎంపీటీసీ బృందం
- పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో గంటపాటు ఉత్పత్తి నిలుపుదల


నదిలో చిక్కుకున్న యువకులను రక్షించిన ఎస్ఐ, ఎంపీటీసీ బృందం

మోతుగూడెం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సీలేరు నదీ ప్రవాహంలో చిక్కుకున్న యువకులను ఎంపీటీసీ బృందం రక్షించింది. హైదరాబాద్, సామర్లకోట నుంచి ఆదివారం వచ్చిన ఆరుగురు యువకులు అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం సమీపంలోని దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద స్నానాలకు దిగారు. కేరింతలు కొడుతున్నారు. ఈ క్రమంలో విజయవాడ విద్యుత్ సౌధ లోడ్ డిస్పాచ్ కేంద్రం ఆదేశాల మేరకు పొల్లూరు జల విద్యుత్‌కేంద్రంలోని జెన్‌కో ఉన్నతాధికారులు రెండు యూనిట్లు ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా సీలేరు నది ప్రవాహం పెరగడంతో ఆరుగురు యువకులు రాళ్లపైకి చేరి రక్షించమని ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఎస్కే సాదిక్ తన సిబ్బందితో, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు స్థానిక ఈతగాళ్లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నీటిప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఎస్ఐ సాదిక్.. ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ప్రవాహంలో చిక్కుకున్న యువకుల గురించి తెలియజేసి, జల విద్యుదుత్పత్తిని కొంత సమయం ఆపమని కోరగా, వారు విజయవాడ విద్యుత్ సౌధ అధికారులకు తెలియజేసి గంటపాటు విద్యుదుత్పత్తి నిలిపివేశారు. దీంతో పెద్దా తాళ్లతో ఆరుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. వారు ఎస్ఐ, ఎంపీటీసీ బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పర్యాటకులు ఎవరూ సీలేరు నదిలో స్నానాలకు దిగరాదన్నారు.

టీడీపీ, జనసేన పోటాపోటీ నినాదాలు

పిఠాపురంలో స్వల్పతోపులాట, ఉద్రిక్తత



పిఠాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో టీడీపీ, జనసేన పోటాపోటీ నినాదాలు, స్వల్పతోపులాటలతో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ఆదివారం సాయంత్రం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. వీరు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ముందుగానే స్టేజీ పైకి చేరుకోగా, మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర జనసేన నేతలు చేరుకుంటున్న సమయంలో ఈ నినాదాలు మరింత హోరెత్తాయి. ఒకానొక సమయంలో రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు పరస్పరం తోసుకున్నారు. అందరు సంయమనం పాటించాలంటూ మంత్రి నాదెండ్ల ఒక సమయంలో చేతులు జోడించి వేడుకున్నారు. నాయకుల ప్రసంగాల సమయంలో మరింతగా నినాదాలతో హోరెత్తించారు. ఈ పరిస్థితి కూటమి నాయకులకు ఇబ్బందికరంగా మారింది. నినాదాల హోరు, తోపులాట జరిగిన నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తమై భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ, జనసేనల మధ్య మరోమారు విభేదాలు బయటపడడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

3 లక్షల ఎకరాలకు సాగునీరు

- తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్
- కాలువలకు నీరు విడుదల
- గోదావరి మాతకు పూజలు




ధవళేశ్వరం వద్ద కాలువలకు విడుదలవుతున్న సాగునీరు, స్విచ్ ఆన్‌చేసి గేట్లను ఎత్తుతున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్

ధవళేశ్వరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో తూర్పు డెల్టాలో 3లక్షల ఎకరాలకు సాగునీటిని సక్రమంగా అందించనున్నామని తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్ అన్నారు. రబీ సీజన్ అనంతరం మూసివేసిన డెల్టా కాలువలకు ఆదివారం ఉదయం సాగునీటిని విడుదల చేశారు. ధవళేశ్వరంలోని తూర్పుడెల్టా హెడ్ స్లూయిస్ వద్ద సర్కిల్ ఇన్‌చార్జి ఎస్ఈ బత్తుల వెంకటస్వామి, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఈఈ వీవీ రామకృష్ణ గోదావరి మాతకు పూజలు నిర్వహించి చీర, జాకెట్, పసుపు, కుంకుమ, పూలు, పండ్లను గోదావరి మాతకు సమర్పించారు. అనంతరం గేట్లకు స్విచ్ ఆన్‌చేసి హెడ్ స్లూయిస్‌లోని నాలుగు గేట్ల ద్వారా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈఈ మాట్లాడుతూ పంట తుఫాన్‌ల బారిన పడకుండా ఉండడానికి జూన్ 1వ తేదీనే కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు సకాలంలో పంట సాగు చేసి తుఫానుల బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. తూర్పుడెల్టా పరిధిలో రూ.6.10 కోట్లతో 159 పనులు చేపట్టామని, పనులన్నీ వివిధ దశల్లో ఉన్నాయని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. అంతకుముందు ఇన్‌చార్జి ఎస్ఈ బత్తుల వెంకటస్వామి, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్.. బొబ్బర్లంకలోని సెంట్రల్ డెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద గోదావరమ్మకు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో తూర్పుడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, మండపేట డీసీ పీవీ సుబ్బారెడ్డి, డీఈలు ఆనంద్‌బాబు, రమేష్, ఆనంద్‌కుమార్, ఏఈలు రాధాకృష్ణ, అద్దంకి సాయిరాం, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాలువలకు..

నిడదవోలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద ఉన్న హెడ్ స్లూయిజ్‌కు ఆదివారం గోదావరి హెడ్ వర్క్స్ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు పువ్వులు, చీర, రవిక, పండ్లు సమర్పించి హారతులిచ్చి హెడ్ స్లూయిజ్ స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ముందుగా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి అనంతరం సాయంత్రానికి మరో 300 క్యూసెక్కులకు పెంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ కృష్ణంరాజు మాట్లాడుతూ రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలకు నీరందిస్తామన్నారు. ఇప్పటికే కాలువలకు సంబంధించి పూడికతీత పనులు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్స్ రాత పరీక్ష


సూరంపాలెం ఆదిత్య కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్స్ మెయిన్స్ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కాకినాడలో ఐడియల్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, మోహన్ కాలేజ్, గవర్నమెంట్ ఐటీఐ, వీఎస్ లక్ష్మి డిగ్రీ కళాశాల, గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉదయం 10గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1గంటకు ముగిసింది. మొత్తం 12 సెంటర్లలో 6,302 మంది అభ్యర్థులకు 6,021 మంది హాజరైనట్టు జేఎన్టీయూ ప్రొఫెసర్, పరీక్షల కన్వీనర్ సాయిబాబా వెల్లడించారు. తొలుత అన్ని పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షించారు.పూర్తి పారదర్శకతతో నిర్వహించామని ఆయన చెప్పారు.

చిరంజీవినీ కుమారి మృతికి

కవి సంధ్య సంతాపం

యానాం/కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ప్రముఖ విద్యావేత్త, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలు, ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్, అభ్యుదయ రచయిత్రి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మృతికి 'కవి సంధ్య' సంపాదకుడు డాక్టర్ శిఖామణి సంతాపం తెలిపారు. తాను పీఆర్ కాలేజీలో డిగ్రీ చదివే రోజుల నుంచి కవిసంధ్య పత్రిక వరకు ఆమె అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. గత ఏడాది కథా సదస్సు నిర్వహించారన్నారు.మేలో యానాంలో కవి సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన దాట్ల అభినందన సభలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారని గుర్తుచేశారు.

అన్నవరం దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగుల

తాత్కాలిక తొలగింపు

అన్నవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం సీఆర్వో విభాగంలో పనిచేస్తోన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అల్లు కలికేశ్వరరావు, బండారు శ్రీనివాస్‌లను తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. శనివారం రాత్రి దేవస్థానంలో గదులు ఖాళీగా ఉన్నా భక్తులకు కేటాయించని విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఈవో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. గదులు ఖాళీగా ఉన్నా ఎందుకు కేటాయించలేదని వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం కాంట్రాక్ట్ ఉద్యోగులు కలికేశ్వరరావు, శ్రీనివాస్‌లను తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గదులను భక్తులకు కేటాయించకుండా ఖాళీగా ఉంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సత్యదేవుడికి 12 గ్రాముల బంగారం..

సత్యదేవుడికి ఆదివారం ఒకదాత 12గ్రాముల బంగారు ముద్దను విరాళంగా సమర్పించారు. ఆముదాలవలసకు చెందిన బస్వా కాశీబాబు సోదరులు వీటిని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను వారు అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్‌లు అనకాపల్లి ప్రసాద్, యనమల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం

పాఠశాలకు ఇన్వెర్టర్ బహూకరణ

అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పాలగుమ్మి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు ఇన్వెర్టర్, బ్యాటరీని బహూకరించారని ప్రధానోపాధ్యాయుడు ఉండ్రు వెంకటేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మెకానిక్ కుటుంబానికి సాయం

మలికిపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహ ఎలక్ట్రానిక్ యూనియన్ మెకానిక్ పోతురాజు లక్ష్మీనరసింహ ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబానికి రూ.25వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో బొక్కా గోవిందు, భగవాన్, కేశవరామారావు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



పాశర్లపూడిలో రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమానికి, వారు పడుతున్న కష్టాలు తీర్చడానికే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులు రూ.2.17 కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారిని ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. వైనతేయ వారధి పక్క నుంచి చింతలమెరక వెళ్లే ఈరోడ్డును నిర్మించి ఆ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. దశాబ్దాల కాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేను స్థానికులు ప్రశంసలతో ముంచెత్తి తమ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ కుసుమ వనజాకుమారి, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్‌లు కొనుకు ప్రేమజ్యోతి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, టీడీపీ, జనసేన మండలశాఖల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, నాయకులు కొనుకు నాగరాజు, బోనం బాబు, మల్లాడి విష్ణు, గనసాల దీపిక, తుండూరు బుజ్జి, మందా గాంధీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తండ్రిపై క్రిమినల్ కేసు



విద్యార్థి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జిల్లా రవాణాధికారి శ్రీనివాసరావు

అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మైనర్లు మోటారుసైకిల్ నడుపుతూ పట్టుబడితే వారి తండ్రిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు. రహదారి భద్రత విషయంలో కొందరు తల్లిదండ్రులు మైనర్లకు మోటారుసైకిళ్లు ఇస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి భద్రతా నియమాలు పాటించని విద్యార్థులు నడిపిన మోటారుసైకిళ్లపైనమోదుచేసిన కేసుల్లో విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్టీవో కార్యాలయానికి పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నామని ఆయన తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, తల్లిదండ్రులు కూడా చొరవ చూపాలని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం నుంచి విధులు బహిష్కరించినట్టు ప్రకటించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ ఆధ్వర్యంలో హక్కుల సాధనకు తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి విధులను బహిష్కరించినట్టు గౌరవాధ్యక్షుడు ఎం.దుర్గార్జునరావు, యూనియన్ అధ్యక్షుడు దంగేటి షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి యెరుబండి వెంకటసత్యనారాయణలు తెలిపారు. ఉద్యోగ విరమణ వయసును 62ఏళ్లకు పెంచి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరంలో మోకాళ్లపై కుర్చుని నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు నాగారపు శ్రీనివాస్, చిక్కాల తిరుమలవెంకటకుమార్, ఎం.మధు, డి.కృష్ణ, బోనం రమేష్, గంటి రమేష్, ఆర్.నాగేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నర్సింగ్ పోస్టులకు రాత పరీక్ష

యానాం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): యానాంలో జిప్‌మెర్ మల్టీస్పెషాలిటీ కన్సల్టింగ్ యూనిట్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేయడానికి అభ్యర్థుల ఎంపిక కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్షను ప్రశాంతంగా జరిగింది. స్థానిక మెట్టకుర్రులోని రీజెన్సీ పబ్లిక్ పాఠశాలలో ఉదయం 10 నుంచి 11గంటల వరకు రాత పరీక్ష జరిగింది. ఫలితాలను ఆదివారం రాత్రికి ప్రకటిస్తారు. ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు.

మలేరియా నివారణా అవగాహన ర్యాలీ

మామిడికుదురు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణ అవగాహన ర్యాలీ ఆదివారం నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో సత్యవతి కార్యక్రమంలో మాట్లాడుతూ దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ సాధ్యమవుతుందన్నారు. మలేరియా అంతం మనతోనే అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఏడుకొండలు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ బ్రాహ్మణ దినోత్సవం

అమలాపురం, జూన్1(ఆంధ్రజ్యోతి): చాణుక్యుని జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ బ్రాహ్మణ దినోత్సవాన్ని అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పేరి లక్ష్మీనరసింహం మాట్లాడుతూ బ్రాహ్మణుల ఆధ్యాత్మిక సాంస్కృతిక సేవలను గుర్తించి గౌరవించాలన్నారు. బ్రాహ్మణత్వం అంటే ఏమిటో బ్రాహ్మణుడు ఏవిధంగా జీవించాలో వాకర్స్ అంతర్జాతీయ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ వివరించారు. వాకర్స్ జిల్లా పత్రికా సంపాదకుడు పుత్సా కృష్ణకామేశ్వర్, భమిడపాటి నరసింహశాస్త్రి, నూకల సత్యనారాయణ, పట్నాల రమణ మాట్లాడారు. అందరికీఅర్థమయ్యేలా ఉపనిషత్ వాక్యాలను దేవులపల్లి కృష్ణశాస్త్రి వివరించగాపేరిలలిత గానంతో ఆకట్టుకున్నారు.

పండుగలా రేషన్ సరుకుల పంపిణీ

- రేషన్‌షాపుల వద్ద నిత్యావసరాలు పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యేలు, గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు,







అమలాపురం, రాజోలు, అంబాజీపేట మండలాల్లో సరుకులు పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ

అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల పునః ప్రారంభ కార్యక్రమాన్ని ఆదివారం వాడవాడలా పండుగ వాతావరణంలో ప్రారంభించారు. భట్నవిల్లిలో చౌకధరల దుకాణాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించి సీనియర్ సిటిజన్లకు రేషన్ సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మండలీక సుబ్రహ్మణ్యశర్మ, ప్రధాన కార్యదర్శి నామాడి తారక్, ఐటీడీపీ కార్యదర్శి కాట్రు శ్రీనుబాబు, సర్పంచ్ తిరుకోటి సుజాత, తహశీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. బండారులంకలో పలు రేషన్‌దుకాణాలను సర్పంచ్ పెనుమాల సునీత, మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాస్, మాడా మాధవి, కాశిన దుర్గ, పెనుమాల ఏడుకొండలు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): నెలలో 15రోజుల పాటు రోజుకు రెండు పూటలా చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తామని తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు మాదాల నాగసత్యమంగాకుమారి, టీడీపీ పార్లమెంటరీ అధికార ప్రతినిధి బొక్కా రుక్మిణి పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్లగేటు సెంటర్‌లో 17వ వార్డులో చౌకధరల దుకాణంలో బియ్యం పంపిణీని అమలాపురం పార్లమెంటు అధికారప్రతినిధి బొక్కా రుక్మిణి, తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మిలు ప్రారంభించారు. క్రాపచింతలపూడిలో చౌకధరల దుకాణంలో సరుకుల పంపిణీని కౌన్సిలర్ మాదాల నాగసత్యమంగాకుమారి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మాదాల బుజ్జి, చింతలపూడి బాబూరావు, గొల్లపల్లి గోపి, యేడిద శివ, మాదాల శ్రీధర్, పాయసం చిన్నీ, మాదాల త్రిమూర్తులు, డిప్యూటీ తహశీల్దార్ డి.గోపాలకృష్ణ పాల్గొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ 13వవార్డులోని రేషన్ డిపోను ఆదివారం రేషన్ దుకాణాన్ని ప్రారంభించి సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ డి.గోపాలకృష్ణ, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని ఎనివాసరావు, కట్టా సత్తిబాబు, సానబోయిన సోమయ్య, కాశి లాజర్, వీఆర్వో వెంకట్రావు, కటికదల పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డిపోల వద్దే బియ్యం పంపిణీని ప్రారంభించిందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం మలికిపురంలో బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, కాకి లక్ష్మణ్, టి.శ్రీనివాసరావు, అడబాల యుగంధర్, గంటా రాజ్యలక్ష్మి, అడబాల రమాదేవి పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): పేదల ఇబ్బందులను తొలగించేందుకే చౌక దుకాణాల్లో 15రోజులు రెండు పూటలా సరుకులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆదివారం అయినవిల్లిలంక గ్రామంలో రేషన్ పునఃపంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌ సయ్యపురాజు సత్యనారాయణరాజు, కాకర శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు, రేషన్ షాపు డీలర్లు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేసిందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేటలోని రేషన్‌డిపో వద్ద ప్రజలకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే మండలంలో రేషన్ షాపుల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహశీల్దారు వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ ఏడుకొండలు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నాయకులు దాసరి వీరవెంకటసత్యనారాయణ, మైపాల తాతాజీ, మట్టపర్తి భారతి, నాగాబత్తుల సుబ్బారావు, చిన్నం బాలవిజయరావు, కొర్లపాటి డేవిడ్, రవణం రాము, దొమ్మేటి సాయికృష్ణ, రేషన్ డీలర్ దొమ్మేటి ఏడుకొండలు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రేషన్ షాపులను పునః ప్రారంభించిందని ఎమ్మెల్యే దేవ వరప్రసాదరావు అన్నారు. రామేశ్వరం గ్రామంలో మేటకొడప షాపు 9 చౌకధరల దుకాణాన్ని ఎమ్మెల్యే పునః ప్రారంభించారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, దిరిశాల బాలాజీ, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, గుబ్బల ఫణికుమార్, మాలే శ్రీనివాసనగేష్, వీరా మల్లిబాబు, పోతురాజు కృష్ణ, కూటమి శ్రేణులు, రేషన్ డీలర్లు, తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ బాస్కర్, ఆర్‌ఐ రామరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే అంతర్వేది, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, అంతర్వేది దేవస్థానం, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి గ్రామాల్లో రేషన్ షాపులను కూటమి శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రారంభించి సరుకులు అందించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అధికారి ఎస్ఎం షంషే ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం ఉదయం రేషన్ షాపుల వద్ద బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గొల్లవిల్లిలో నెం.17 రేషన్ షాపు వద్ద ఆయన బియ్యం పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ వాసా దివాకర్, సర్పంచ్‌లు నల్లా బాబండి, జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, చిక్కం పెదబాబు, పెయ్యల రాజ్‌కుమార్, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ, సీఈవో మంచెం బాబి, మద్దింశెట్టి సీతారామస్వామి, పెమ్మిరెడ్డి సత్యనారాయణ, మారిశెట్టి పుండరీకాక్షుడు, చీకట్ల ఏసు, యెరుబండి రాంబాబు, సలాది నాగరాజు, మంచెం బాలకృష్ణ, సుంకర నాయుడు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): అక్రమాలు అరికట్టేందుకే రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ పునః ప్రారంభించినట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్లలో ఆదివారం ఆయన రేషన్ డిపోను ప్రారంభించి, లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపురెడ్డి మాణిక్యాలరావు, ఏలూరి సూర్యనారాయణమూర్తి, గంజా శ్రీను పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ చేస్తున్నామని తహశీల్దార్ సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం రేషన్ దుకాణం వద్ద బియ్యం పంపిణీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, సానబోయిన ఏసు, గంటి వెంకటసుధాకర్, సుంకర బుజ్జి, వాసంశెట్టి రాజేశ్వరరావు, విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు.లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా రేషన్ అందించాలి

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనలు అనుసరించి రేషన్ సరుకులు అందించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను డీలర్లకు సూచించారు. పి.గన్నవరం 12వ నెంబర్ రేషన్‌డిపోలో రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం డిపో సమీపంలో ఉన్న ఓ వృద్ధురాలికి ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి రేషన్ సరుకులు అందించారు. అలాగే రేషన్ డిపోలో ఉన్న కంది పప్పు, పంచాదార నాణ్యతను పరిశీలిం చారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్.మురళీకృష్ణ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి, నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, ఆదిమూలం సూరయ్యకాపు, యడ్ల ఏసు, తాటికాయల శ్రీవెంకటసత్యనారాయణ, కోట రాజేంద్ర, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల శ్రేయస్సు కోసం మంచి నిర్ణయాన్ని తీసుకుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. రాజోలులో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న చౌకధరల దుకాణం నంబరు5ను ఎమ్మెల్యే దేవ, అమలాపురం ఆర్డీవో కె.మాధవిలు పునఃప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రేషన్ షాపుల వద్ద ప్రతీ నెలా 15వతేదీ వరకు సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ఆర్డీవో మాధవి మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తా మన్నారు. చాగంటి స్వామి, కాట్నరాజు, సూరిశెట్టి శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, వద్రే శ్రీను, సర్పంచ్ రేవు జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, మోకా పార్వతి, అడబాల విజయ్, కోఆప్షన్ సభ్యులు షేక్ ఇస్మాయిల్, కడలి వెంకటరమణారావు, డీఎల్పీవో బొజ్జిరాజు, డీటీ సీఎస్ రాజు, డీలర్లు పాల్గొన్నారు. పొన్నమండలో చౌకధరల దుకాణాన్ని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ప్రారంభించారు. ఎంపీటీసీలు కడలి దుర్గ, మోకా ఉష, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు దాకే ఏడుకొండలు, జనసేన గ్రామశాఖ అధ్యక్షుడు అల్లు శివ, మాజీ ఎంపీటీసీ కడలి అబ్బు, అప్పారి వీరవెంకటసత్యనారాయణ, సరెళ్ల వెంకట్రావు, నక్కా రమణ, ఉండ్రు రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పునః పంపిణీని ఎమ్మెల్యేలు ఆదివారం ప్రారంభించారు. నగరంలో పిఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మగటపల్లిలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌లు రేషన్ పంపిణీని ప్రారంభించారు. రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలను పారదర్శకంగా పంపిణీ చేయాలని డీలర్లను ఆదేశించారు. ప్రతీ గ్రామంలోను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీని ప్రారంభించారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, డెల్టా సంఘ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, ఆర్‌ఐ ఇబ్రహీం పాల్గొన్నారు.

కనకాల తాతయ్యకు ఘన నివాళి

యానాం, జూన్1(ఆంధ్రజ్యోతి): యానానికి చెందిన పుదుచ్చేరి విలీనోద్యమనేత కనకాల తాతయ్య వర్ధంతిని యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫెర్రీ రోడ్డులోని ఆయన విగ్రహానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరగు భాస్కరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణా, సీఐ అడలరసన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, కనకాల రామదాసు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాచారశాఖ అధికారి కేఎల్‌వీ ప్రసాద్, రాజు, కనకాల తాతయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అల్పాహార విందు

అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు పర్యటనలో భాగంగా హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద ఆధ్వర్యంలో కొంకాపల్లి హరిమనో వికాస కేంద్రంలోని దివ్యాంగులకు ఆదివారం అల్పాహార విందు అందించారు. గోరకకొండ నాగేంద్ర, బూరగాయల శివరామకృష్ణ, పుత్సా కృష్ణకామేశ్వర్ పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు ఈనెల4న తలపెట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా శాఖ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. భట్నవిల్లిలోని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ స్వగృహం వద్ద ఆదివారం వెన్నుపోటు దినం పోస్టర్‌ను నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భాగ్యలక్ష్మి, కుడుపూడి బాబు, మట్టపర్తి నాగేంద్ర, చెల్లుబోయిన నాని, పందిరి శ్రీహరి, కుడుపూడి భరత్‌భూషణ్, మార్గాన గంగాధర్, గొల్లపల్లి డేవిడ్, గుత్తుల చిరంజీవి, కేతా భానుతేజ, బద్రి బాబ్జి, మోటూరి సత్యంకాపు, కొల్లాటి దుర్గాబాయి పాల్గొన్నారు.

గణపతిరావు మృతి చేనేత రంగానికి తీరనిలోటు



అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషిచేసిన సహకార సంఘ మాజీ ఉపాధ్యక్షుడు కటకం గణపతిరావు(60) మృతి చేనేత రంగానికి తీరని లోటని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ జడ్పీటీసీ చింతా శంకర మూర్తి, రాష్ట్ర దేవాంగ సంక్షేమసంఘ చేనేత విభాగం అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, కాశిన బాబి, కొండా సత్యనారాయణరాజు, ఆశపు రామలింగేశ్వరరావు, చింతా పోతురాజు, కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తదితరులు ఆయన మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గణపతిరావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుతో పాటు బస్ షల్టర్ నిర్మాణానికి ఆయన చేసిన కృషిని స్థానికులు గుర్తుచేసుకున్నారు.

బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా రామకృష్ణ

అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా భమిడిపాటి వీఎస్ రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన్ను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశంతో పాటు ఎస్వీఎస్ఎస్ సీహెచ్ కృష్ణమూర్తి, శర్మ, మండలీక ఆదినారాయణ తదితరులు అభినందించారు.

నేడు ఇంటర్ కళాశాలల ప్రారంభం

ముమ్మిడివరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం ముమ్మిడివరంలోని డాక్టర్ ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులను సోమవారం ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రశాంతి తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, వారంతా తరగతులకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ప్రకటనపై టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు హర్షం

ముమ్మిడివరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వల్ల ఏ ఒక్క దళిత వర్గం నష్టపోకుండా 59 ఉపకులాలకు న్యాయం జరిగే విధంగా ఎస్సీ రిజర్వేషన్ అమలుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం పట్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు (బాలు) హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలను యూనిట్‌గా తీసుకుని జనాభా ప్రాతిపదికన, రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలుచేసి ఎస్సీలకు సామాజిక న్యాయం చేస్తామని చెప్పిన చంద్రబాబుకు, అందుకు కృషిచేసిన ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు దళిత సామాజికవర్గం తరపున తాను కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మానాలు



అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రణాళికాధికారిగా పనిచేస్తున్న పి.వెంకటేశ్వర్లు (62) ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం అమలాపురం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది హాజరై వెంకటేశ్వర్లు సేవలను కొనియాడారు. నూతనంగా ఏర్పడ్డ కోనసీమ జిల్లాకు గుంటూరు నుంచి బదిలీపై వచ్చిన వెంకటేశ్వర్లు విశిష్ట సేవలు అందించారన్నారు. విధి నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు దంపతులతో పాటు డిప్యూటీ స్టాటస్టికల్ ఆఫీసర్ ఆర్.శంకరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్రావు, రవాణాశాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిల కోసం నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

అమలాపురం టౌన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలకు ఎనిమిది వారాలుగా వేతన బకాయిలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ఉపాధి కూలీలకు కల్పించిన సౌకర్యాలు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయని ఆవేదనవ్యక్తంచేశారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200రోజులు పనిదినాలు కల్పించడంతో పాటు రోజువారీ కూలీ రూ.600 చెల్లించాలన్న డిమాండ్లతో చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని పి.శివ, దైవకృప, రత్నకుమారి, శ్రీదేవి పిలుపునిచ్చారు.

వెన్నుపోటు దినం బ్రోచర్ ఆవిష్కరణ

పి.గన్నవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు విమర్శించారు. పి.గన్నవరంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల4న తలపెట్టిన వెన్నుపోటు దినం బ్రోచర్‌ను స్థానిక నాయకులతో కలిసి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మందపాటి కిరణ్, జడ్పీటీసీలు కసి రెడ్డి అంజిబాబు, బూడిద వరలక్ష్మి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

బాలబాలాజీని దర్శించుకున్న ఎస్పీ కృష్ణారావు



మామిడికుదురు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఎస్పీకి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉభయ దేవేరులతో కొలువైన బాలబాలాజీని దర్శించుకున్నారు. అనంతరం ఎస్పీకి వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందించారు. ఆలయ పర్యవేక్షకుడు బి.సత్యంమూర్తి, నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పి.గన్నవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి):ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాం చదువులమ్మ చెట్టునీడలో అంటూ పూర్వ విద్యార్థులు ఆదివారం పి.గన్నవరం హైస్కూల్‌లో చేసుకున్న సంబరాలు అంబరాన్నం టాయి. అందరికి ఆదర్శం మనస్నేహం.. మనస్నేహం చిరస్మరణీయం.. ఈస్నేహం ఎప్పటికీ ఇలాగే ఉండాలని కోరుకుంటూ 1995-96 పదో తరగతి పి.గన్నవరం హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరూ ఆలింగనం చేసుకుని సరదాగా గడిపారు. తమతో పదో తరగతి చదువుకుని అకాలమరణం చెందిన ఏడుగురు విద్యార్థులకు నివాళులర్పించారు. గురువులను దుశ్శాలువాలతో సన్మానించారు. పూర్వ విద్యార్థి ప్రస్తుత ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి మాట్లాడుతూ ఈఅపూర్వకలయిక ఇంతటితో ఆగిపోకూడదని రాబోయే రోజుల్లో కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థులను ఆదుకుంటూ సామాజిక సేవలో పాలుపంచుకుని నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): బలుసుతిప్పలో ఆదివారం పూర్వ విద్యార్థుల కలయిక జరిగింది. ఉపాధ్యాయుడు వీరమల్లు నాగేశ్వరరావును సన్మానించారు. కార్యక్రమంలో మల్లాడి ఏడుకొండలు, సంగాని సూర్యనారాయణ, తిరుమాని వీరబాబు, బర్రె రాంబాబు, ఓలేటి రామాంజనేయులు, దామ సత్యానందం, కాకర రమేష్, తిరుమాని గోవిందు, పొన్నాడ సతీష్, కోరుమిల్లి ప్రసాద్, ఓలేటి శ్రీను పాల్గొన్నారు.



రేషన్‌షాపు పునఃప్రారంభం

ముమ్మిడివరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 13వ వార్డులోని రేషన్ డిపోను ఆదివారం రేషన్ దుకాణాన్ని ప్రారంభించి సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ డి.గోపాలకృష్ణ, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని ఎనివాసరావు, కట్టా సత్తిబాబు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కాట్రేనికోన, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నడవపల్లిలో ఆదివారం కొబ్బరి వలుపు, దింపు కార్మిక సంఘాల సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, మండల కన్వీనర్ విత్తనాల రాంబాబు హాజరై కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. జూలై 9న 13 కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పలివెల చిన్న, రేవు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, గుత్తుల భైరవమూర్తి, అర్జునరావు, విత్తనాల శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

ముమ్మిడివరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) మోకా సత్తిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం ఠాణేలంక పంచాయతీ పరిధిలోని పెదపేటలో ఆదివారం అంబేడ్కర్ 134వ జయంత్యుత్సవంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా ఏర్పాటుచేసిన జ్ఞానమందిరాన్ని సత్తిబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా వాకపల్లి వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన సభలో సత్తిబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. మరో ముఖ్యఅతిథిగా నగర పంచాయతీ కమిషనర్ కమిడి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు విద్య ఎంతో అవశ్యకమన్నారు. నాయకులు చెల్లి అశోక్, కొంకి అంబేడ్కర్, నక్కా వెంకటరమణ, ఇసుకపట్ల నాగేంద్ర, గిడ్డి బాలకృష్ణ, పులిదిండి వెంకటదుర్గాప్రసాద్, జనిపల్లి దుర్గాప్రసాద్, రామచంద్రరావు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

దసరాబుల్లోడుకోడుపై కాలిబాట వంతెనకు శ్రీకారం

ఉప్పలగుప్తం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కాకపోవడంతో దసరాబుల్లోడుకోడుపై కాలిబాట వంతెన నిర్మాణానికి విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ నిర్ణయం తీసుకున్నారు. ఒకే పంచాయతీలో రెండు ప్రాంతాలకు అడ్డుగా దసరాబుల్లోడుకోడు డ్రెయిన్ ఉంది. గతంలో ఒక సారి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా నిర్మాణం మాత్రం జరగలేదు.ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా బియ్యం ఇచ్చే ఏర్పాట్లు చెయ్యడంతో నెలనెలా బియ్యం తీసుకునేందుకు ఆరు కిలోమీటర్లు రావాలంటే ఎలా అని గోకనవిల్లివాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కాలిబాట వంతెన నిర్మించేందుకు సర్పంచ్ సంకల్పించారు. ఆదివారం కాలిబాట వంతెన పనులకు శ్రీకారం చుట్టారు.

వైసీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా బాబి



మామిడికుదురు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా మాకనపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల బాబి నియమితులయ్యారు. వైసీపీ అధిష్ఠానం బాబిని ఈపదవిలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

రేషన్ డిపోల్లో నిత్యావసర వస్తువుల పంపిణీ

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను అందిస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. మండపేటతోపాటు తాపేశ్వరంలో ఆయన రేషన్ దుకాణాలను ప్రారంభించి లబ్ధిదారులకు రేషన్ అందజేశారు. పట్టణంలోని 11 వ వార్డులో వున్న 6వ నెంబరు రేషన్‌దుకాణాన్ని స్థానిక నేతలతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, డీటీలు శ్రీనివాస్, పద్మ, మున్సిపల్ కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

మండపేట, (ఆంధ్రజ్యోతి): వివిధ ఆసుపత్రుల్లో వైద్యసేవలు పొందిన 17 మందికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ 13,08,036 ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల చేతులుమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమినేతలు తదితరులు పాల్గొన్నారు.

సచ్చిదానంద దివ్యజ్ఞాన సమాజ భవనం ప్రారంభం

మండపేట, (ఆంధ్రజ్యోతి): తాపేశ్వరంలో నిర్మించిన సచ్చిదానంద దివ్యజ్ఞాన సమాజం నూతన భవనాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. తాపేశ్వరానికి చెందిన బోడా వెంకటరత్నం 1941లో దీన్ని స్థాపించారని నిర్వాహకులు తెలిపారు. ఆయన ఆశయసాధనను నేటికీ కొనసాగించటం హర్షనియమని అన్నారు. తెలుగు ఫెడరేషన్ అధ్యక్షులు రామచంద్రరావు, సమాజ అధ్యక్షుడు ఆర్ఎస్ మూర్తి మాట్లాడారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వేగుళ్లను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు, స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

వర్షం పడితే భక్తులకు ఇక్కట్లే

ఆత్రేయపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు శ్రీరామ్‌నగర్ సమీపంలో పార్కింగ్ సదుపాయం కల్పించారు. చిన్న పాటి చినుకులకే పార్కింగ్ స్థలం బురదగా మారడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. పార్కింగ్ ప్రాంతం నుంచి కనకదుర్గ ఆలయం మీదుగా వెళ్లే వాహనాలు రద్దీ ఏర్పడటంతో ఆ రహదారి కూడా బురదగా మారడంతో భక్తులు అవస్థలుపడ్డారు. కనకదుర్గమ్మ ఆలయ సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రైనేజీలో పేరుకుపోవడంతో మురుగునీరు వెళ్లే మార్గం లేక దుర్వాసన వెదజల్లి భక్తులు ఇబ్బందులు పడ్డారు. లొల్ల సమీపంలో సైఫాన్ నిర్మాణ పనులు చేపట్టడంతో ట్రాఫిక్‌ను మళ్లించారు. వాడపల్లి కొత్త వంతెన వద్ద వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాడపల్లి-లొల్ల రహదారులు వద్ద ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనాల ద్వారా వచ్చే భక్తులు రావులపాలెం మీదుగా స్వామి వారి సన్నిధికి చేరుకోవడంతో ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు.

వనువులమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కపిలేశ్వరపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కేదార్లంకలో ఉన్న వనువులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం తీర్థం జరిగింది. శనివారం రాత్రి అమ్మవారి జాతర సందర్భంగా గరగన్నృత్యాలు, డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషాలు, బాణసంచా మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని చీర, రవిక, గాజులు, పూలు, పండ్లు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.




వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.8.06 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.8,06,929 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి హైదరాబాద్‌కు చెం దిన వి.వినోద్, త్రిలోచరాణి దంపతులు రూ.50,307, పంజా భాస్కర కృష్ణారావు రూ.50 వేలు విరాళం ఇచ్చారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందచేశారు.



వాడపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ప్రత్యేక ప్రణాళికతో వాడపల్లి ఆలయం అభివృద్ధి

ఆత్రేయపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం వాడపల్లిలో ఆయన స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులు నత్తనడకగా సాగడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ అధికారులతో సమీక్షించి అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కమిషనరు అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కాయల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



అహల్యాబాయ్ హోల్కర్ జయంతిని నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

బీజేపీ ఆధ్వర్యంలో అహల్యాబాయ్ హోల్కర్ జయంతి

కొత్తపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఇండోర్ సంస్థాన రాణి వీరవనిత అహల్యాబాయ్ హోల్కర్ జయంతిని ఆదివారం కొత్తపేటలో బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ తొగర ఆంజనేయులు మాట్లాడుతూ హోల్కర్ తన సేవా భావంతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని గొప్ప విలువలు కలిగిన వీర మహిళ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంపతి కనకేశ్వరరావు, పాలూరి జయప్రకాష్ నారాయణ, గొలకోటి వెంకటేశ్వరరావు, పాలాటి మాధవస్వామి, యు.ప్రసాదరాజు, నల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గారపాటి బాధ్యతల స్వీకరణ



గారపాటి శ్రీనివాసరావు

ఆలమూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెదపళ్లకు చెందిన గారపాటి శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో జరిగిన ఎన్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర సమావేశంలో కౌన్సిల్ ప్రతినిధులు పోలిశెట్టి బాలవెంకట కోటేశ్వరరావు, పిడుగు బాబురావు, అబ్బుల్ గఫర్‌షేక్, దొంకెన అనూషల సమక్షంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయన్ను ఎన్‌హెచ్‌ఆర్‌సీలోకి తీసుకోవాలని నిర్ణయించి ఆ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పలువురు అభినందించారు.

ముఖ్యమంత్రి ప్రకటనపై టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడి హర్షం

ముమ్మిడివరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వల్ల ఏ ఒక్క దళిత వర్గం నష్టపోకుండా రిజర్వేషన్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల అంబేడ్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పి.నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలను యూనిట్‌గా తీసుకుని జనాభా ప్రాతిపదికన, రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్లు అమలుచేసి ఎస్సీలకు సామాజిక న్యాయం చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ద్రాక్షారామ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 132 కేవీ డబుల్ సర్క్యూట్‌లో పాడైన టవర్ల తొలగింపులో భాగంగా సోమవారం నెలపర్తిపాడు, గణపతి నగరం, మామిడిగుంట, జగన్నాయకులపాలెం, జగనన్నకాలనీలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు.



రామచంద్రపురం పట్టణం ముచ్చుమిల్లిలో చౌకధరల దుకాణంలో సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్, ఆర్డీవో అఖిల తదితరులు



కె.గంగవరంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్



ఆలమూరులో రేషన్ షాపును ప్రారంభించి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

• రేషన్ సరుకుల పంపిణీలో మంత్రి సుభాష్ • దివ్యాంగులు, వృద్ధుల ఇంటి వద్దకే రేషన్ పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 1(ఆంధ్రజ్యోతి): పేదలకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఆదివారం రామచంద్రపురంలోని ముచ్చుమిల్లిలో చౌకధరల దుకాణం ప్రారంభించి రేషన్ సరుకులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 29,760 రేషన్ దుకాణాలు పునఃప్రారంభించామన్నారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరుకులు ఇస్తారన్నారు. మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయన్నారు. గతంలో ఎండీయు వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక లబ్ధిదారులు ఇబ్బందులు పడేవారన్నారు. ఎండీయు వాహనాల ద్వారా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించారని ఆరోపించారు. అక్రమ రవాణా అరికట్టేందుకు, ప్రజలు వీలైన సమయంలో రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు వీలుగా చౌకధరల దుకాణాలు పునఃప్రారంభించామన్నారు. ఎండీయు వాహనదారులకు ఆయా వాహనాలు ఉచితంగా అందిస్తామన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ ఎండీయు వాహనాలతో ప్రజలు ఏ సమయంలో వాహనాలు వస్తున్నాయో తెలియక రేషన్ కోల్పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. దీంతో ప్రభుత్వం చౌకధరల దుకాణాలను పునఃప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మాధురి, ఎంఎస్‌వో, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో ఆదివారం మంత్రి సుభాష్ చౌకధరల దుకాణంలో సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్, ఉపసర్పంచ్ గంధం విజయభాస్కర్, ఎంపీటీసీ కె.వెంకటేశ్వరి, టీడీపీ నాయకులు తోట రాము, జనసేన నాయకులు ఎం.పాపారావు, ఎం.గంగాధర్, గంధం ఉమాశంకర్, కూటమి నాయకులు పాల్గొన్నారు. హసన్‌బాదలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు రేషన్ దుకాణంలో సరుకులు పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు పాల్గొన్నారు. ద్రాక్షారామలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ ప్రారంభించగా, ఎంపీటీసీ నున్న సత్యవతి పాల్గొన్నారు. వెంకటాయపాలెంలో 52వ షాపును సర్పంచ్ యల్లమల్లి సతీష్‌కుమారి ప్రారంభించి సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలోఎంపీటీసీ సభ్యురాలు కె.వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు. చోడవరంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం రేషన్ రేషన్ దుకాణం ప్రారంభించి సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి రేషన్ దుకాణాల వద్దనే సరుకులు తీసుకునే ఏర్పాటు ప్రభుత్వం చేసిందని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం ఆయన కె.గంగవరంలో రేషన్ పంపిణీని పునఃప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఆయన స్వయంగా రేషన్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ పి.నాగమణి, కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులు పునఃప్రారంభం

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఆయా ప్రాంతాల్లో రేషన్ దుకాణాలు పునః ప్రారంభం అయ్యాయి. ఆలమూరులో తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబుల అధ్వర్యంలో ప్రారంభించిన అనంతరం సరుకుల పంపిణీ చేపట్టారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభమైందని తహశీల్దార్ ప్రకాష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, ఈదల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చు

ఎమ్మెల్యే సత్యానందరావు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను 15 రోజుల్లోగా ఎప్పుడైనా తీసుకోవచ్చని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం ఆత్రేయపురంలో ఆయన రేషన్ డిపోను ప్రారంభించి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజేశ్వరరావు, కూటమి నాయకులు ముదునూరి వెంకట్రాజు, కూసంపూడి రామకృష్ణంరాజు, సర్పంచ్ గెడ్డం సుధ, ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు రేషన్ షాపులను ప్రారంభించి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలో రేషన్ సరుకుల పంపిణీ ఆదివారం పునః ప్రారంభమైంది. స్థానిక సహకార సొసైటీ వద్ద షాపు నం. 29లో రేషన్ పంపిణీని సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, బీజేపీ నాయకులు నామాల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అర్జమ్మ, రేషన్ డీలర్లు శీలం భాస్కరరావు, చిట్టెమ్మ, పలివెల రమణ, బి.శేషారావు, సొసైటీ సీఈవో రామకృష్ణ, నీటి సంఘం అధ్యక్షులు కొరపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం రేషన్ పంపిణీ ప్రారంభించారు. రాయవరంలో తహశీల్దారు ఐపీ శెట్టి రేషన్ పంపిణీని పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో కూటమి నేతలు వై.ఆర్కే. పరమహంస, శాకా నాగేంద్ర, కొవ్వూరి చంటిరెడ్డి, సర్పంచ్ మల్లిడి పెద్దబ్బాయి, కటారి రామకృష్ణ, కొవ్వూరి నాగిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, వీఆర్వో పి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీని ఆదివారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. లబ్ధిదారులకు ఆయన సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉపసర్పంచ్ విళ్ళ మారుతీప్రసాద్ తదితరులతో పాటు కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దారు వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా రేషన్ అందించేందుకు కృషి

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా సక్రమంగా రేషన్ సరుకులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం రేషన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించి వినియోగదారులకు సరుకులు అందచేశారు. గోపాలపురంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు తదితరులు రేషన్ దుకాణాలను ప్రారంభించారు.




కపిలేశ్వరపురం సొసైటీ వద్ద రేషన్ సరుకుల పంపిణీని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు. పక్క చిత్రంలో రాయవరం మండలం వెదురుపాకలో రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

ఆర్థికసాయం

కె.గంగవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పక్షపాతంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబానికి మంత్రి సుభాష్ ఆర్థికసాయం చేశారు. కుందూరు సావరం గ్రామానికి చెందిన అనసూరి వీర్రాజు పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆర్థిక సమస్యలతో వారు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మంత్రి ఆదివారం కుందూరు సావరంలో వీర్రాజు భార్య జానకమ్మకు రూ.10వేలను ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట పలువురు కూటమి నాయకులు తదితరులు ఉన్నారు.

టెన్త్ వాల్యూయేషన్ తప్పిదాలకు

బాధ్యత వహించాలి

ద్రాక్షారామ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల పేపర్ల తప్పుడు మూల్యాంకనానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ డిమాండు చేశారు. టెన్త్ వాల్యూయేషన్‌లో జరిగిన తప్పిదాలను అధికారులు, ఉపాధ్యాయులపై మోపడం సమంజసం కాదన్నారు. రీవాల్యుయేషన్‌కు ఫీజులు చెల్లించి ఉత్తీర్ణత సాధించిన వారందరికీ ఫీజులు తిరిగి చెల్లించాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ7.76 చెక్కులను ఆదివారం ఆయా కుటుంబాలకు మంత్రి సుభాష్ పంపిణీ చేశారు. కాజులూరు మండలం అండ్రంగి, కోలంక, కుయ్యేరు, రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం, అన్నాయిపేట, కె.గంగవరం మండలం కుందూరు తదితర గ్రామాలకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందచేశారు. కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న ఎన్‌డీఏ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

కొత్తపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ఎన్‌డీఏ ప్రభుత్వం అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో దూసుకుపోతోందని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆదివారం కొత్తపేటలో ఏర్పాటు చేసిన సందీప్ ఐ హాస్పటల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి సందీప్ ఛారిటబుల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, సందీప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారు చిట్టిబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అయ్యాజీ వేమ, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, తమలంపూడి రామకృష్ణారెడ్డి, అయినవిల్లి సత్తిబాబు, పాలూరి జయప్రకాశ్‌నారాయణ, సంపతి కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అంగర సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లూరు గ్రామంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. నల్లూరులో ఆర్డీఎస్ఎస్ పనుల వల్ల అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

జాతీయ సాహిత్య పరిషత్‌లో గౌరిమల్లిక్ కవితలు

ఆలమూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య పరిషత్ అధ్వర్యంలో సిందూరం గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కవితా గోష్ఠిలో చింతలూరు కవి కామవరపు మల్లికార్జునరావు(గౌరిమల్లిక్) తన కవితలను వినిపించారు. ఆదివారం ముదిగొండ శివప్రసాద్, ధార్మిక ప్రవచనకర్త సత్యవాణి సమక్షంలో గౌరిమల్లిక్ రచించిన కవితను వినిపించారు. ఆయన్ను పలువురు అభినందించారు. ముందుగా ఆయన రచించిన పుస్తకాలను వారికి అందజేశారు.



జాతీయ సాహిత్య పరిషత్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

5న సత్తెమ్మ జాతర

రాయవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వెదురుపాక శివారు ప్రాంతంలో ఆరికరేవుల రోడ్డులో ఉన్న సత్తెమ్మ జాతర 5న నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అమ్మవారి ప్రతిరూపమైన గరగలకు గ్రామోత్సవం జరిపారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని వెదురుపాక, నదురుబాద, ఆరికరేవుల పరిసర ప్రాంతాల భక్తులకు అన్నసమారాధన జరుపనున్నారు.

బాలబాలాజీని దర్శించుకున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

మామిడికుదురు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) ఎస్పీ బి.కృష్ణారావు ఆదివారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఎస్పీకి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఉభయ దేవేరులతో కొలువైన బాలబాలాజీని దర్శించుకున్నారు. అనంతరం ఎస్పీకి వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు బి.సత్యంమూర్తి, నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి అమ్మవారికి ఎమ్మెల్యే బండారు పూజలు

ఆలమూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దర్శించుకున్నారు. పురాతన ఆలయం కావడంతో ఇటీవల ఆలయాన్ని గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మించారు. శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఎమ్మెల్యే బండారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు మెర్ల గోపాలస్వామి, జాంప్రొలు వెంకట్రావు, ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చొప్పెల్లలో కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు